# వారసత్వం

**కోటమర్తి రాధాహిమబిందు**



**కథ**

ఫోను మ్రోగింది. ఆనందంగా మాట్లాడుకుంటున్న వాళ్లంతా క్షణ కాలం ఆగారు. గంగాధర్ లేచి ఫోను దగ్గరికి వెళ్లబోయేంతలో కట్ అయింది. అప్పుడే గుడి నుండి వచ్చారంతా... తెల్లవారుఝామున గుడికి వెళ్లి చైతన్య పేరుమీద పూజ చేయించారు.

మొబైలు మ్రోగింది.

"వియ్యాలవారి నుండేమో" అన్నాడు శ్రీనివాసరావు.

"అవును నాన్నగారూ"... అంటూ "నమస్తే సార్" అన్నాడు.

"నమస్తే... మీకో విషయం చెప్పాలి".

"చెప్పండి".

"దయచేసి మీరు మరోలా అనుకోవద్దు"

"ఫర్వాలేదు చెప్పండి... ఎందుకు సందేహిస్తున్నారు?"

"మా వాళ్లంతా పెళ్లి హైదరాబాద్‌లో చేయమని వత్తిడి తెస్తున్నారు"

"అంటే..."

"మీరు కాస్త ఆలోచించాలి... పెళ్లి యిక్కడైతే మాకు కన్వీనియంట్‌గా వుంటుంది".

"యిదేంటండీ యిలా అంటున్నారు? నిశ్చితార్థం రోజున ఈ విషయంలో ప్రత్యేకించి చెప్పాను. మీరు అక్కయ్యగారు సరే అన్నారు".

"కాదనటంలేదుగా అన్నాం... కానీ యిప్పుడు కాస్తా అభిప్రాయం మారింది. మీరు అర్థం చేసుకోవాలి ప్లీజ్".

"ఒ.కే. మా నాన్నగారితో అమ్మగారితో మాట్లాడి మళ్లీ మీకు ఫోను చేస్తాను" అంటూ జేవురించిన ముఖంతో గంభీరంగా కూర్చుండిపోయాడు గంగాధర్.

"ఏంట్రా... ఏమన్నాడు?" అడిగింది చూడామణి.

"ఏముందమ్మా అతితెలివి" ఆవేశంగా అన్నాడు.

"విషయం ఏంట్రా?" అడిగాడు శ్రీనివాసరావు.

"పెళ్ళి హైదరాబాదులో చేయాలట... వాళ్లవాళ్లంతా పెళ్లి హైదరాబాదులో చేయాలని వత్తిడి తెస్తున్నారట... అయినా హైదరాబాదు వాళ్లకు యిదో ఆనవాయితీ అయిపోయింది. హైదరాబాదులో సంబంధం కుదిరిందంటే యిదో చిరాకు అవుతుంది. పెళ్లి అక్కడ చేయమనటం ఏంటి? తట్టా బుట్టా సర్దుకునిపోయి వాళ్ల కన్వీనియంట్ కోసం మనం యిబ్బందులు పడటం ఏంటి? అయినా ఈ విషయంలో యిక్కడ ఒప్పుకునిపోయి మళ్లీ మాట మార్చటం ఏంటి?"

"గంగా ఎందుకంత ఆవేశం...కాస్సేపు స్థిమితంగా కూర్చో" శ్రీనివాసరావు గంగాధర్‌ని కూర్చోబెట్టాడు.

"ఛీ... ఛీ..."

"నాన్నా ఆలోచిద్దాం...కాస్సేపు ప్రశాంతంగా వుండు" అంది చూడామణి.

"యిక్కడైతే మనకు ఎంత కన్వీనియంట్‌గా వుంటుందమ్మా... పాతిక సంవత్సరాల నుండి యిక్కడ ఉద్యోగం చేస్తున్నాను...పిల్లలు యిక్కడే పుట్టారు... వాళ్ల పెళ్లిళ్లు యిక్కడే చేయాలని నాకు ఎంతో కోరికగా వుంది. యిక్కడ నాకు బోలెడంత మంది స్నేహితులు... సన్నిహితులు... ఎంత మ్యాన్‌వపర్... ఎంత అండబలం... అక్కడ మ్యారేజ్ ఫంక్షన్‌హాలంటే మాటలా? చాలాముందుగా బుక్ చేసుకోవాలి. పైగా బోలెడంత డబ్బు పెట్టాలి. ఖర్చు అని గాదమ్మా... అన్‌నెససరీగా ఎందుకు పెట్టాలి? చైతన్య పెళ్లి ఓ అందమైన అనుభూతిగా నిలిచిపోవాలని నాకుంది. దానికోసం నా మనసులో ఏదేదో ప్లాను చేసుకుంటున్నాను".

"నిశ్చితార్థం అయింది గాబట్టి మనం సరే అంటామనుకుంటున్నారేమో" అంది విమల.

"అదేంటమ్మా అలా మాట్లాడతావ్... నిశ్చితార్థం అయితే ఏంటి? వాళ్లు అడిగే ప్రతీదీ ఒప్పుకోవాలా? వాళ్లు అనే ప్రతి మాటకీ జవదాటకుండా వుండాలా?" తండ్రికంటే చిరాగ్గా అంది చైతన్య.

"చైతన్యా నువ్వాగు" సముదాయించింది చూడామణి... ఒక్కసారిగా ఆ వాతావరణం స్థంభించిపోయినట్లయింది. కొన్ని క్షణాలు ఎవరి ఆలోచనల్లో వాళ్లు పడిపోయారు.

** ** **

గంగాధర్ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. భార్య విమల హౌజ్‌వైఫ్. యిద్దరు పిల్లలు ముందు అమ్మాయి చైతన్య... యింజనీరింగ్ అయిపోయింది. తర్వాత అబ్బాయి చరణ్ యింజనీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు. తల్లి తండ్రి పల్లెలో వుంటారు.

చైతన్యకు జాబ్ వచ్చింతర్వాత పెళ్లి చేయాలనుకున్నాడు గంగాధర్. కానీ ఒక పెళ్లిలో సంబంధపు వివరాలు తెలిశాయి. అబ్బాయి ప్రస్తుతం అమెరికాలో వున్నా మరో రెండు నెలల్లో యిండియా రాబోతున్నాడు. యిక్కడే స్థిరపడిపోతున్నాడని తెల్సింది. క్లోజ్ ఫ్రెండ్స్ సంబంధం విషయంలో ప్రోత్సహించారు. గంగాధర్ ఎటూ తేల్చుకోలేక తల్లి తండ్రిని పిలిపించాడు.

"అమెరికా సంబంధం అంటే నాకు అస్సలు యిష్టంలేదు నాన్నగారూ... యిప్పుడు యిలా అనుకున్నా మళ్లీ అమెరికా వెళ్తే... పిల్లలు నా కళ్ల ఎదురుగా వుండాలి. యిప్పుడు ఎంతమందిని చూడటం లేదు టి.వి.ల్లో. ఎన్నెన్ని విషయాలు వినటంలేదు...ఈ ఎన్.ఆర్.ఐ. సంబంధాల జోలికే పోవటం యిష్టంలేదు".

"గంగా... అందుబాటులో వున్న సంబంధాన్ని వదిలి ఎక్కడో ఆలోచిస్తావేంరా... వాకబు చేద్దాం. అన్నివిధాలా బాగుందన్పిస్తేనే మొగ్గుదాం. మంచి సంబంధం అయినప్పుడు ఎందుకు వదులుకోవటం...

కాస్త ఉన్నవాళ్లు అబ్బాయిది మంచి ఉద్యోగం. అక్క పెళ్లయిపోయింది. తల్లితండ్రి ఉద్యోగస్తులు... అబ్బాయి అమెరికా వెళ్లాడని తెల్సింది.

తల్లి తండ్రి మాటను కాదనలేకపోయాడు గంగాధర్. శ్రీనివాసరావు హైదరాబాదు వెళ్లి విషయాలు సేకరించటం...వాళ్లు చాలా బాగా నచ్చటంతో ఓ అడుగు ముందుకేశారు.

అబ్బాయి యిండియా వచ్చాక పెళ్లి చూపులకు రావటం ఒకరికొకరు నచ్చటం జరిగిపోయాయి. నిశ్చితార్థం కూడా జరిగిపోయింది. యిక లగ్నాలు పెట్టుకోవటమే మిగిలింది. యింతలో వియ్యాలవారి నుండి ఈ ఫోను.

** ** **

నాలుగురోజుల తర్వాత గంగాధర్ వాళ్లకు ఫోను చేసి చెప్పాడు 'మీ సంబంధం మేం వదులుకుంటున్నాం అని... వాళ్లు ఆశ్చర్యపోయారు... 'యిక్కడ మ్యారేజ్ ఫంక్షన్ హాలు... క్యాటరింగ్ వగైరాలన్ని మేం బుక్ చేస్తాం మీకేంటి యిబ్బంది... మీ వరకు చక్కగా వచ్చేయండి. యిదివరకు మీరు మేము... యిప్పుడు మనంగదా... మన ఫ్యామిలీస్ రెండు అన్నివిషయాల్లో ఎంతో బాగా మ్యాచయిపోయాయి. ఈ ఒక్క విషయంలో మీరు ఒప్పుకోగూడదా' చాలా మర్యాదగానే రిక్వెస్ట్ చేశారు.

"సారీ... ఏదో అహంభావంతో యిలా చెబుతున్నాననుకోకండి మా యింటిల్లిపాదికి గర్వాలు...అహంభావాలు అంటూ ఏమీలేవు. అవేంటో తెలియవు కూడా. మాకు తెల్సింది అభిమానాలూ, ఆత్మీయతలూ అంతే. అమ్మాయి పెళ్లి మా యిష్టపూర్తిగా చెయ్యాలనుకున్నాం. అదీ మా యింటిముందు చెయ్యాలనుకున్నాం... జీవితంలో ఒకే ఒకసారి చూడ గలిగే అపురూప దృశ్యం' హృదయాంతరాలలో నిలిచిపోయే ఓ గొప్ప అనుభూతి. మీరు అక్కడే పెళ్లి చేయాలని ఖచ్చితంగా చెప్పారు. కానీ అమ్మాయి పెళ్లి యిక్కడే చేయాలని నాకుంది. ఈ కారణంగానే వదులుకుంటున్నాం" అని ఫోను పెట్టేశాడు.

రెండు రోజుల తర్వాత అబ్బాయి అజయ్ నుండి ఫోను వచ్చింది చైతన్యకి. అతను ఏదో చెప్పబోతుంటే విన్పించుకోకుండానే గట్టిగా



మా యింటిల్లిపాదికి గర్వాలు...అహంభావాలు అంటూ ఏమీలేవు. అవేంటో తెలియవు కూడా. మాకు తెల్సింది అభిమానాలూ, ఆత్మీయతలూ అంతే. అమ్మాయి పెళ్లి మా యిష్టపూర్తిగా చెయ్యాలనుకున్నాం. అదీ మా యింటిముందు చెయ్యాలనుకున్నాం... జీవితంలో ఒకే ఒకసారి చూడ గలిగే అపురూప దృశ్యం' హృదయాంతరాలలో నిలిచిపోయే ఓ గొప్ప అనుభూతి. మీరు అక్కడే పెళ్లి చేయాలని ఖచ్చితంగా చెప్పారు. కానీ అమ్మాయి పెళ్లి యిక్కడే చేయాలని నాకుంది. ఈ కారణంగానే వదులుకుంటున్నాం"

అంది చైతన్య.

"మీకున్నట్టు మాకు యిష్టాలు వుండవా? నా పెళ్లి మానాన్నగారికి ఓ అపూర్వమైన విషయం... అయినా మీకేం కష్టం? మీ వాళ్లందరితో యిక్కడికి రావచ్చుగా. ఏం ఆడపిల్లలన్నా, ఆడపిల్లల తల్లిదండ్రులన్నా మీకెందుకంత చులకన భావం. అసలు నేను మరో రెండేళ్లదాకా పెళ్లే చేసుకోదల్చుకోవడం లేదు" వేగంగా చెప్పేసింది.

"చైతన్యా... అంతా మీరు కోరుకున్నట్లుగానే అవుతుంది. మీరు ఏంటేంటో ప్రతిజ్ఞలు చేయకండి. ప్లీజ్... మీరు నాకెంతగానో నచ్చారు ముఖ్యంగా మీ డ్రస్సింగ్, మాటతీరు. సంప్రదాయంగా వుండే విధానం మరింతగా నచ్చింది. నేను ఎలా కోరుకుంటానో అలా వున్నారు. ఈ ఫాషన్లు, భేషజాలు ఉన్నవాళ్లమని అహంభావాలు మాకేం తక్కువ అన్న గర్వం...యిలాంటివి నాకు చాలా చిరాకు. అస్సలు నచ్చవు. రెండు జీవితాలు కలవటానికి మంచిమనసు మంచి వ్యక్తిత్వం ముఖ్యమని నా అభిప్రాయం" యిలా నిలదీసి అడగటం కూడా ఎంతగానో నచ్చింది. సో... మీ అమ్మా నాన్నగారితో మీ నాన్నమ్మ తాతగారితో చెప్పండి. మేం నిన్ను పెళ్ళి చేసుకోవటానికి మీ ఊరికే వస్తున్నాం. యిప్పుడు ఒ.కే.నా?" నవ్వాడు అజయ్.

"థ్యాంక్యూ" చైతన్య పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

** ** **

గంగాధర్ ముఖం వెలిగిపోతుంటే శ్రీనివాసరావు, చూడామణి, విమల, చైతన్య ఎంతో సంబరపడిపోయారు. ఆ సంతోష వాతావరణంలో చరణ్ లేనందుకు కాస్త బాధ అన్పించినా చదువుకోసం గదా దూరంగా వుంది అనుకుని సరిపెట్టుకున్నారు.

అక్క యమునని బావగారు ఆనందరావుని మీ సలహాలు గావాలంటూ ఆహ్వానించాడు గంగాధర్. సాయంత్రానికల్లా యిద్దరూ వచ్చారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో అంతా హాల్లో కూర్చున్నారు. తండ్రికి ఓ పేపర్ పెన్ యిచ్చాడు గంగాధర్.

"నాన్నగారూ వెడ్డింగ్ కార్డ్స్ అచ్చంగా నా పెళ్లప్పటి వెడ్డింగ్ కార్డ్స్‌లా వుండాలి. యిదిగో యిది మోడల్" అంటూ ప్రక్కనే డైరీలో వున్న వెడ్డింగ్ కార్డు యిచ్చాడు. అంతా ఆశ్చర్యపోయారు ఓ క్షణం. మరు క్షణం ఆ కార్డు అందుకుని అంతా చూశారు. ఓ అరగంట అప్పటి పెళ్లి విషయాల్లోకి వెళ్లిపోయి మళ్లీ ప్రస్తుతంలోకి వచ్చారు. చైతన్య వాళ్ల మాటల్ని ఎంతో ఆసక్తిగా విన్నది.

"నాన్నగారూ వాళ్లు మూడు బస్‌లకు వస్తున్నట్లుగా చెప్పారు. అవిగాక, సుమోలు, కార్లు అని గూడా చెప్పారు. వారె... ఎంత ఎక్కువ మంది వస్తే అంత సంతోషం అనుకోండి. ఎదురుకోళ్లు వగైరాలన్ని చాలా పద్ధతిగా ఏ చిన్న లోపం రాకుండా అవుతాయి. తెల్లవారుఝామునే చేరుకుంటారు కాబట్టి ముందు మంచి కమ్మటి చిక్కటి కాఫీ యిద్దాం. టిఫిన్‌గా ఉప్మా... కారప్పూస... బూందీ... అరిశలు. యిడ్లీ... వడ వగైరాలు వుండవు".

"అదేంట్రా... ఈ రోజుల్లో అలా..."

"వాడు అలా అనుకున్నాడు. అంతే. బాగా ఫాషను మరగటం కాకపోతే వాటికి ఏమయ్యిందట... యిదివరకు తినలేదా? అయినా అలా ఎంత బాగుంటుంది. ఈ రోజుల్లో అరిశలు ఎవరు పెడుతున్నారు? నో డౌట్. వాళ్లంతా చప్పరించుకుంటూ మరీ తింటారు ఆc తర్వాత చెప్పరా నాయనా" అంది చూడామణి ఎంతో ఉత్సాహంగా.

"యింటిముందంతా తాటాకు పందిరి వేయిస్తాను. క్రింద నేలంతా పేడనీళ్ళు చల్లించి ముగ్గులు వేయిస్తాను".

"క్రింద జంపఖానాలు పరిపిస్తావా గంగా" నవ్వాడు ఆనందరావు.

"మంచి ఐడియా బావగారూ... ఓపిక వున్నవాళ్లు కూర్చుంటారు లేని వాళ్లకి కుర్చీలు వుంటాయి. పచ్చి కొబ్బరి ఆకులతో పెళ్లి మండపం... బంతిపూలు చామంతులు...గులాబీలతో అలంకరణ. రాత్రి పెళ్లి కాబట్టి దేదీవ్యమానంగా బల్బులు, ట్యూబ్‌లైట్లు వెలుగులు విరజిమ్ముతుంటాయి".

"అరేయ్ గంగా భోజనాల మాటేమిటి? ఆ విషయంలో ఎలా అనుకున్నావ్" ముందుకు వంగుతూ ఆసక్తిగా అడిగింది చూడామణి.

శ్రీనివాసరావు, ఆనందరావు, యమున, చైతన్య ఒకర్ని ఒకరు చూసుకుంటూ గుంభనంగా నవ్వుకున్నారు.

"భోజనాలు అంతేనమ్మా...నో బఫేసిస్టమ్...నో మోడ్రన్ వంటలు... చాలామంది క్రింద కూర్చుని భోంచేయలేరు గాబట్టి భోజనాలకి టేబుల్స్, కుర్చీలు వేయిస్తాను. నిజానికి క్రిందనే భోజనాలు పెట్టించాలని వుంది ఊరుకోనులే కొన్ని బ్యాచ్‌లు అలా లేపుతాను. నో... బిర్యానీ... నో బగారాలు ఓన్లీ తెల్లటి అన్నం... పప్పు... కూరలు... పచ్చళ్లు... కమ్మటి నెయ్యి... గడ్డ పెరుగు".

"మరి స్వీట్సు"

"ఆ ఛాయిస్ బావగారికి యిస్తున్నాను... మీ పెళ్లికి మేం వడ్డించిన స్వీట్స్ ఏంటి బావగారూ... చెప్పండి".

ఆనందరావు క్షణకాలం కంగుతిని ఆలోచనలో పడిపోయేసరికి అంతా గొల్లుమన్నారు. "పూర్ణాలు అయితే గుర్తు..."

"తోరణం కట్టి పూర్ణం వేయటం మామూలే. అబ్బా, యిలా చెప్పి 'నేను చెప్పాను' అని అన్పించుకోవాలనా... అదేం కుదరదు. అప్పటి స్వీట్సు చెప్పండి. వాటినే యిప్పుడు చేయబోయేది..."

నవ్వాడు ఆనందరావు.

"మీకు వడ్డించింది నేను సార్. నాకు చాలాబాగా గుర్తున్నాయి. రేపటి భోజనం ఐ మీన్ పెళ్లిరోజున చరణ్ వాళ్ల బావగారికి వడ్డిస్తాడు. ఆ సీన్‌ని కళ్లారా చూసుకోవాలి" గంగాధర్ తమకంగా అంటుంటే యమున కళ్లు తడి అయ్యాయి.

మొబైలు మ్రోగింది. గంగాధర్ "హలో బావగారూ నమస్తే" అన్నాడు. అవతల చెప్పిన విషయం విని చిరునవ్వు నవ్వాడు.

"ఏమంటున్నాడురా" శ్రీనివాసరావు చూడామణి ఒకేసారి అడిగారు.

"వాళ్లు వెనుకటి నగలు చేయించాలనుకుంటున్నారట. కాసులపేరు... జిగినీ గొలుసు... వంకీలు... వడ్డాణం అంటూ చెప్పబోతున్నారు- మీ అమ్మాయిని అడిగిచెప్పండి అంటున్నారు... ఏం తల్లీ... చైతూ యిదీ నా యిష్టమేనా లేక... అయినా యివన్నీ యిప్పటి మోడ్రన్‌గా వచ్చేస్తున్నాం గదా! ఓ.కే. చెప్పేస్తాను". చిరునవ్వుతో తండ్రినే చూసింది చైతన్య. మళ్లీ చర్చలో మునిగిపోయారంతా.

** ** **

చైతన్య, అజయ్‌ల పెళ్లి గంగాధర్ కోరుకున్న ప్రకారం జరిగిపోయింది. అంతా టిఫిన్లు, భోజనాలు బ్రహ్మాండంగా వున్నాయని మెచ్చుకున్నారు. ఎరేంజ్‌మెంట్సు అత్యద్భుతం అని పొగిడారు. మా పెళ్లి మళ్లీ మేం చూసుకుంటున్నట్లుంది అన్నారు. పెళ్లివారు చాలా సరదాగా ఫీలయ్యారు. హైదరాబాదులో పెళ్లిఅంటే యిలా వెళ్లటం అలా రావటం... యింత దూరం ప్రయాణం... ఒక ఊరికి వచ్చి యింత సరదాగా ఎంజాయ్ చేయటం... పైగా ఈ పెళ్లి మాకో తీపిగుర్తుగా వుండిపోతుంది అంటూ ప్రతిఒక్కరూ ఆనందంగా చెబుతుంటే గంగాధర్ చాలా సంతోషించాడు. "ఖర్చు ఎంత పెడితే ఏం లాభం? భోజనం బాగుండాలి. ఈ పది సంవత్సరాలలో యింత మంచి భోజనం చేయటం యిదే" అనుకుంటుంటే మరీ మరీ సంతోషించాడు.

** ** **

చైతన్య ఓ యింటిది అయిందన్న ఆనందంలోనే మరో ఆనందం కలిసిపోయి అజయ్ ఓ మంచి యిల్లు కట్టించాడన్న వార్త. అదీ ఎవ్వరికీ తెలియనీయకుండా సస్పెన్స్‌గా వుంచి గృహప్రవేశం అంటూ తనవాళ్లని ఆశ్చర్యపరిచాడు. గృహప్రవేశం రోజు రానేవచ్చింది. తనవైపు వాళ్లని చైతన్యవైపువాళ్లని మాత్రమే పిలిచాడు అజయ్. యింటిముందు చక్కటి పూలతోట అందరికీ ఆహ్వానం పలికింది. ఎన్ని లక్షలు పెట్టి యిల్లు కట్టాడో అనుకుంటూ ఎంతో ఆసక్తిగా వచ్చిన వాళ్లంతా విస్తుపోయారు. గృహ ప్రవేశం అయింతర్వాత అన్నాడు అజయ్.

"నాకిలాంటి యిల్లు చాలా చాలా యిష్టం. ఐదు గదులకు సిమెంటుతో గచ్చు చేయించటం మీ అందరికి ఆశ్చర్యాన్ని కల్గిస్తుందని నాకు తెల్సు. ఒక్క గదికి ఎ.సి. చేయించాను. కాస్త క్లాస్‌గా వుంచాను. యిది బయటివాళ్లకోసం. నన్ను కలవటానికి వచ్చేవాళ్లు అసౌకర్యంగా ఫీల్ కాగూడదు గదా...మిగతా ఐదు గదులు పూర్తి నా పర్సనల్ లైఫ్. బెడ్ మీదికంటే గచ్చుమీద దిండేసుకుని టి.వి. చూడటం నాకెంతో యిష్టం. యిది తాతగారి ఊరిలో ఫీలింగ్. డైనింగ్ టేబుల్ మీదికంటే క్రింద కూర్చుని భోంచేయటం నాకిష్టం. యిదివరలో మాయింట్లో యిలాగే తినేవాళ్లం. గదులన్నీ యిరుకుగా చేయటం యిష్టంలేదు. అందుకే ఫర్నిచర్ పెద్దగా ఏంకొనలేదు. బాగా అవసరం అన్పించినవే కొన్నాను" అలా అలా యిల్లంతా కలియచూపిస్తూ తన యిష్టాలెన్నిటినో చెప్పాడు.


"వెనుకటి మా యిల్లులా వుంది నాయనా" అంది చూడామణి ఆనందంగా. "చాలా బాగుందిరా.. మరీ యింటిముందు పూలతోట వంటగది అచ్చంగా మనింటిలాగానే వున్నాయి" ఆనందంగా అంది అజయ్ నానమ్మ.

"కుర్చీలు అప్పటి మోడల్‌లో చేయించావురా. భేష్" అంది అజయ్ అమ్మమ్మ.

"నాకైతే ఈ ఉయ్యాలబల్ల బాగా నచ్చింది" అన్నాడు శ్రీనివాసరావు.

"నిజంగా యిల్లు చాలా బాగుందిరా. ఎంతో ప్రశాంతంగా హాయిగా అన్పిస్తుంది" అంటూ కొడుకును కౌగిలించుకున్నాడు అజయ్ తండ్రి. గంగాధర్ కూడా మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు. విమలకు కాస్త విచిత్రంగానే అన్పించింది. అజయ్ తల్లి కొడుకును పదేపదే దగ్గరికి తీసుకుని మురిసిపోయింది.

"ఆ రణగొణ ధ్వనుల మధ్య విసుగ్గా అన్పిస్తుందమ్మా. ముఖ్యంగా ప్రశాంతత, మనశ్శాంతి అన్నవి ఏ మనిషికైనా అవసరం. మన యిల్లు మనకోసం. చూసేవాళ్లకి నచ్చేలా వుండాలనిలేదుగా. చైతన్య అంటుంది అప్పటి బంగారు ఆభరణాలన్నీ యిప్పుడు మోడ్రన్ అయినట్లు అప్పటి మోడల్‌లో యిల్లు కట్టాంగా మనల్ని చూసి మరికొంతమంది యిలా కట్టుకుంటారు అని. యిదే మోడ్రన్ అవుతుందని. మన సంప్రదాయాల్ని, మన పద్ధతుల్ని పాటించటం నాకెంతో యిష్టం. చైతన్య కూడా నాలాగే ఆలోచిస్తుంది. యిలా యిల్లుకట్టటంలో తన ఐడి యాస్, హెల్ప్ ఎంతో వున్నాయి".




అంతా ఆనందంగా చప్పట్లు కొట్టారు.

** ** **

చైతన్య అజయ్‌లకు బాబు పుట్టాడు. సంవత్సరకాలం యిట్టే గడిచిపోయింది. కూతుర్ని వదిలి ఎక్కువ రోజులు వుండలేని గంగాధర్ కూతుర్ని అల్లుడ్ని, మనవడ్ని చూసిపోదామని వచ్చాడు. అతని రాకకు చైతన్య, అజయ్ ఎంతగానో సంతోషించారు. ఆ రాత్రి చాలాసేపు మాట్లాడు కున్నారు ముగ్గురూ. ఆ తర్వాత తన కోసం కేటాయించిన గదిలోకి వెళ్లబోతూ ఆగాడు ఒక్షణం...టేబుల్ మీద కొన్ని బుక్స్ కన్పిస్తుంటే ఆసక్తిగా తీసుకుని చూశాడు.

పెద్దబాలశిక్ష, సుమతీశతకం, వేమన శతకం, వేంకటేశ్వర సుప్రభాతం, హనుమాన్‌చాలీసా, విష్ణుసహస్రనామం.

అవి ఎవరికోసమో గంగాధర్‌కి అర్థమైంది. ●